క్లుప్తంగా

వాహనాలను తనిఖీ చేయాలి

తొగుట(దుబ్బాక): వాహనాలను క్షుణ్ణంగా తనిఖీచేయాలని అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. మండలంలోని వెంకట్రావుపేటలో చెక్‌పోస్టు ఏర్పాటుకు స్థలాన్ని బుధవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి భద్రతల విఘాతం కలిగించే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆలయాల్లో బీఆర్ఎస్ నాయకుల పూజలు



బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ భారీ మెజార్టీతో గెలిచి హ్యాట్రిక్ సాధించాలని కోరుతూ బుధవారం బెజ్జంకి, కల్లెపెల్లి గ్రామాల్లోని ఆలయాల్లో బీఆర్ఎస్ నాయకులు పూజలు చేసి ఇంటింటి ప్రచారం ప్రారంభించారు కారు గుర్తుకు ఓటు వేసి రసమయి బాలకిషన్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో గుబిరె మల్లేశ, ఫాక్స్ వైస్ చైర్మన్ బండి రమేష్, ఆలయ చైర్మన్ బండారి రాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల అభ్యున్నతి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి అని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. బుధవారం ఆయన చిన్నకోడూరులో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మద్యం వ్యాపారం విచ్చలవిడిగా నడుస్తోందన్నారు. అవినీతి కుటుంబ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో నాయకులు మహేందర్, పర్శరాములు, జయంత్, రాజు పాల్గొన్నారు.

భద్రతాదళాల కవాతు



హుస్నాబాద్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

హుస్నాబాద్: నవంబర్ 30న జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఏసీపీ సతీష్, సీఐ కిరణ్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఫోర్స్ ఎస్ఎస్బీ (సశాస్త్ర సీమబాల్) అధికారులు, సిబ్బందితో కలిసి బుధవారం పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఏసీపీ కార్యాలయం నుంచి గాంధీ చౌరస్తా, మల్లెచెట్టు చౌరస్తా, అనబేరి చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, నాగారం రోడ్డు నుంచి ఏసీపీ కార్యాలయం వరకు ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా ఏసీపీ సతీష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు వజ్రాయుధమని, ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు ప్రాధాన్యత గొప్పదన్నారు. ఓటు విషయంలో ఎవరైన బెదిరింపులకు పాల్పడితే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు మహేష్, వివేక్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బుధవారం రాత్రి జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో గజ్వేల్ ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించాయి. పోలీస్ స్టేషన్ నుంచి గొల్లపల్లి చౌరస్తా వరకు కవాతు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుహక్కు ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. కవాతులో సీఐ జానకిరాంరెడ్డి, బీఎస్ఎఫ్ బలగాలు, ఎస్ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, బీఎస్ఎఫ్ బలగాలు

అధికారం కోసం కుట్ర

- మోసపూరిత బీఆర్ఎస్‌ను ఓడించాలి
- ఎమ్మెల్సీకి రాజీనామా చేసి పల్లా పోటీ చేయాలి
- కార్యకర్తల సమావేశంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): మోసపూరిత బీఆర్ఎస్ పార్టీని ఓడించి అబద్ధాల ముఖ్యమంత్రికి బుద్ధి చెప్పాలని, అధికారం కోసం ఆ పార్టీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని రేణుక గార్డెన్‌లో బుధవారం జరిగిన చేర్యాల, కొమురవెల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. మండల పరిధిలోని గుర్జకుంట మాజీ ఎంపీటీసీ బొమ్మగోని రవిచందర్‌గౌడ్, 2వ వార్డుకు చెందిన మాజీ ఎంపీటీసీ, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బండెల మహిపాల్‌రెడ్డి పార్టీలో చేరారు. వీరితోపాటు చేరిన ఆయా పార్టీలకు చెందిన నాయకులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను చేర్యాల ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేశానన్నారు. నియోజకవర్గంలోని నర్మెట్ట, చేర్యాల మండలాల్లో విద్యా సంస్థల ఏర్పాటుకు 12 ఎకరాల భూమిని దానం చేశానని తెలిపారు. ఈ ప్రాంత సమస్యలను తెలుసుకుని సాగునీటి ప్రాజెక్టు తెచ్చానన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గజ్వేల్, సిద్దిపేటకు నీటిని మళ్లించేందుకు కాల్వల నిర్మాణంపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదని లేఖ ఇవ్వమని కేసీఆర్, హరీశ్‌రావు కోరితే ఆ లేఖను చించివేసిన సంగతి గుర్తుచేశారు. అలా చేసినందుకే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఆ రోజు సంతకం చేసి ఉంటే ఈ రోజు మంత్రిగా ఉండేవాడినన్నారు. చేర్యాల ప్రాంత రైతులకు సాగు నీరందించేందుకు తెచ్చిన తపాసుపల్లి రిజర్వాయర్‌కు కాళేశ్వరం జలాలు వస్తున్నాయని అబద్ధం ఆడుతున్న సీఎం కేసీఆర్‌కు ఈ ప్రాంత ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. జనగామ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓటర్లను మభ్యపెట్టి గెలుపొందాలని చూస్తున్నాడని ఆరోపించారు. ఏనాడు జనగామ ముఖం చూడని పల్లా ఇప్పుడు చేర్యాల ప్రాంతాన్ని సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకు దీటుగా అభివృద్ధి చేస్తానంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించి తన గెలుపునకు సహకరించాలని కోరారు. అనంతరం జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్, కో చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ చేయాలంటూ కొన్నేళ్లుగా చేస్తున్న పోరాటంపై స్పందించని అధికార పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఈ ప్రాంత ఓటర్లు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ గిరి కొండల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, పీఏసీఎస్ డైరెక్టర్లు కొమ్ము రవి, ఉడుముల బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు సందుల సురేష్, చెవిటి లింగం, మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, మాజీ ఎంపీపీ బొడిగె నర్సింహులుగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరులో అమ్మవారి శోభాయాత్ర



రెడ్డిసేన యూత్ సభ్యులతో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

శోభాయాత్రలు.. నిమజ్జనం

దుబ్బాక: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. దుబ్బాకలో అమ్మవారి శోభాయాత్ర మంగళవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. యాత్రలో డప్పు చప్పుళ్లు, డీజే పాటలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. హిందూ వాహిని యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి శోభ యాత్రలో ఎమ్మెల్యే రఘునందన్ రావు, రెడ్డి సేన ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరుతోపాటు మాచాపూర్, చంద్లాపూర్, సికింద్లాపూర్ గ్రామాల్లో బుధవారం దుర్గామాత నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. యువత కోలాటాలు, నృత్యాల మధ్య అమ్మవారి శోభాయాత్ర సాగింది. అనంతరం చెరువుల్లో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



దుబ్బాక: ఎమ్మెల్యే రఘునందన్ రావును సన్మానిస్తున్న హిందూ వాహిని యూత్ సభ్యులు

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు

సిద్దిపేట సీపీ శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని సిద్దిపేట సీపీ శ్వేత అన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో బీఎస్ఎఫ్, ఎస్ఎస్బి అధికారులు, స్థానిక ఏసీపీలతో చెక్‌పోస్టులు, వాహనాల తనిఖీ, ఫ్లాగ్ మార్చ్, ఈవీఎం వీవీప్యాట్, స్ట్రాంగ్ రూం బందోబస్తుపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నవంబర్ 30వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు, స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛా వాతావరణంలో వినియోగించుకునేలా భరోసా కల్పించడంలో భాగంగా ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహనాల తనిఖీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో బీఎస్ఎఫ్ కమాండెంట్ ఇంద్రజిత్ చావ్లా, ఎస్ఎస్బీ కమాండెంట్ రఘునాథ్, అడిషనల్ కమాండెంట్ రవి, అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్‌కుమార్, ధర్మరాజ్, రాథోడ్, రవి, సర్వేష్, అడిషనల్ డీసీపీలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, ఏసీపీలు సురేందర్‌రెడ్డి, సతీష్, రమేష్, చంద్రశేఖర్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరి ఇంటింటి ప్రచారం



పథకాలు వివరిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపిస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

బహిరంగ ప్రకటన

[illegible]

Sd/- Y. CHANDRA RUSHI B.Sc., L.L.B
Advocate & Notary, # 1-2-273, Opp: Court, Brundaven Colony, JANGAON Town & Dist. Cell: 9848430926.

కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపిస్తాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్‌రూరల్: తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపిస్తామని మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ వినూత్న పథకాలను అమలుచేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. మిషన్ భగీరథ పథకంతో తాగునీటి ఇబ్బందులు తొలగించారని, నిరుపేదలకు అండగా నిలుస్తూ ఆసరా ఫించన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను చేపట్టారన్నారు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తూ ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించారని గుర్తు చేశారు. గజ్వేల్ నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహించడం ఈ ప్రాంతం అభివృద్ధిలో 50 ఏళ్ల ముందుకు వెళ్లిందని కొనియాడారు.

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లోకి వలసలు

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి



లక్ష్మీపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు చూసి వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో బుధవారం ఆయా పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానకొండూర్‌తో పాటు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. ఎన్నికలప్పుడు వచ్చి మోసపూరిత వాగ్దానాలు చేసే నాయకులను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, లింగాల లక్ష్మణ్, ముక్కిస తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ప్రతినిధుల రక్తదానం

సిద్దిపేటకమాన్: వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు కేసీ గుప్తా వర్ధంతిని బుధవారం క్లబ్ ప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకురాలు సౌజన్య డాక్టరేట్ అందుకున్నారు. ఆమె 'సింథసిస్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ స్ట్రక్చరల్, స్పెక్ట్రమ్, డై ఎలక్ట్రిక్ అండ్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ నిఖిల్ కోబాల్ట్ ఫెర్రైట్స్ అండ్ మల్టీ రేర్ ఎర్త్ డోస్డ్ నిఖిల్ కోబాల్ట్ ఫెర్రైట్స్ ఫర్ ఎనర్జీ హార్వెస్టింగ్ అప్లికేషన్' అనే అంశంపై పరిశోధన చేశారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాశశి మాట్లాడుతూ ఫిజిక్స్‌లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించడం అభినందనీయమన్నారు. పీహెచ్‌డీ పూర్తి చేసేందుకు సహకరించిన వారికి సౌజన్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఉమారాణి, డాక్టర్ అనిత, డాక్టర్ సరోజ, డాక్టర్ జయరాజ్, శ్రీలత పాల్గొన్నారు.

దుబ్బాకలో బీజేపీ జెండా ఎగరేద్దాం

జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): దుబ్బాకలో బీజేపీ జెండా ఎగరేద్దామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ అధ్యక్షులు, పన్నా ప్రముఖ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలన్నారు. గత ఉప ఎన్నికల్లో రఘునందన్‌రావు గెలుపొందిన తర్వాతనే దుబ్బాకలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. దుబ్బాకలో జాబ్‌మేళా నిర్వహించి వేలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత రఘునందన్‌రావుకు దక్కిందన్నారు. అలాగే యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ విఫలమైందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

గజ్వేల్‌రూరల్: నిరుద్యోగ యువతులకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూషన్ డైరెక్టర్ రాజలింగం బుధవారం తెలిపారు. గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు కలిగి, 10వ తరగతి చదివిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. మెదక్ రోడ్డులో కోటిలింగాల గుడి సమీపంలో ఉన్న యూనియన్ బ్యాంకు (గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ)లో ఈనెల 31లోగా తమ ఆధార్‌కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, 3 కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటోలు, 10వ తరగతి మెమో జిరాక్స్‌తో నేరుగా సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 08457 359653 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): నవంబర్ 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్దూరు మండలంలోని నర్సాయపల్లి, గాగ్గిళ్లాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీ అధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్, ర్యాంప్ సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ యూనుస్ అహ్మద్ అలీ, సెక్టోరియల్ ఆఫీసర్ ఖాజా మొహినుద్దీన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్‌లో చేరికలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని రేగులపల్లెలో పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జంగిలి తిరుపతి, వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బుధవారం కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ నిమజ్జనం



హుస్నాబాద్ రూరల్: హుస్నాబాద్ మండలంలోని పలుగ్రామాల్లో దేవి నవరాత్రుల సందర్భంగా మండపాలను ఏర్పాటుచేసి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. బుధవారం దుర్గమ్మ విగ్రహాలను శోభాయాత్ర నిర్వహించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

◆ బీఆర్ఎస్‌లో చేరికలు

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజక వర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన రఘోత్తంపల్లి, చీకోడ్, భూంపల్లి గ్రామాలకు చెందిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

◆ ఆర్థిక సహాయం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన మల్లారపు స్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోషకుమార్, వైస్ఎంపీపీ మల్లిపెద్ది సుమలత బుధవారం పరామర్శించారు. పార్టీ తరుపున రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

◆ కరపత్రం ఆవిష్కరణ

చేర్యాల(సిద్దిపేట): నవంబర్ 5వ తేదీన ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న మాదిగల యుద్ధభేరికి భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి భూమిగారి రాజేందర్ పిలుపునిచ్చారు. బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ కౌన్సిలర్ మంగోలు చంటితో కలిసి యుద్ధభేరి కరపత్రాలను ఆవిష్కరించారు.

పోలీసుల తనిఖీల్లో నగదు పట్టివేత

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని జాలిగామ బైపాస్‌లో నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో జాలిగామ బైపాస్‌లో వస్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా రూ. 2.14 లక్షలు గుర్తించామన్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు



గాయపడిన రమణి



గాయపడిన మల్లాద్రి

కొండపాక: బైక్‌ను తప్పించబోయిన ఆటో బోల్తా పడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని లకుడారం స్టేజీ (ఐఓసీ పెట్రోల్ బంక్) వద్ద బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట నుంచి బైక్‌పై మల్లాద్రి కుకునూర్‌పల్లి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో సిద్దిపేట నుంచి కిష్టాపూర్‌వైపు రమణి, లక్ష్మీ ఆటో ప్రయాణిస్తున్నారు. లకుడారం స్టేజీ వద్ద బైక్‌ను తప్పించబోయని ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు, యువకుడికి గాయాలయ్యాయి. కొండపాక 108 సిబ్బంది క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలోని గోశాల సమీపంలో కొద్ది రోజుల క్రితం కారు ఢీకొనడంతో గుర్తు తెలియని వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో భిక్షాటనతో జీవనం కొనసాగిస్తున్న వృద్ధురాలిని ఈనెల 16వ తేదీన చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన సాతెల్లి సాయికిరణ్ కారులో వస్తూ ఆమెను ఢీకొట్టాడు. గాయపడిన వృద్ధురాలిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకోసం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి ఆచూకీ లభ్యం కాలేదని, వాహనదారుడిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడి

సిద్దిపేటఅర్బన్: అనుమతి లేకుండా కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్న ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట త్రీటౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని వెల్కటూరు గ్రామంలో బత్తిని వెంకటేశం గౌడ్, బత్తిని లింగంగౌడ్ కిరాణా దుకాణాలపై పోలీసులు దాడులు చేయగా మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990